క్లుప్తంగా

మెగా ఉచిత వైద్యశిబిరం



గుడివాడరూరల్: స్థానిక గణేష్ హాస్పిటల్స్ వైద్యబృందం ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక పామర్రు రోడ్‌లోని క్వాలిటీ ఫీడ్స్ ఆవరణలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ యలవర్తి పవన్ గణేష్ ఆధ్వర్యంలో 200 కుటుంబ సభ్యులకు 10 రకాల ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గోర్జి పృథ్వీ, డాక్టర్ దివ్య పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



గుడివాడ టౌన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లో శ్రీ రాజరాజేశ్వరి హోల్‌సేల్ ఫ్రూట్స్ మర్చంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఇస్రో శాస్త్రవేత్త రాజా శ్రీధర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఫ్రూట్స్ మర్చంట్స్ యజమాని డి. రాజేష్ వేసవి కాలంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం శ్రీధర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో యోగా మిత్ర డీకేఎస్ శ్రీనివాస్, వి. నవీన్, ఎం. శ్రీధర్, కె. శ్యామ్‌సుదర్, కె. శ్యాము, జి. రవి, పి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన బాలుడికి ఆర్థిక సాయం

గుడివాడ టౌన్: ప్రమాదవశాత్తు గాయాలపాలైన బాలుడు శంకర్‌కు లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్. శేషగిరిరావు, కార్యదర్శి అన్నె నవీన్ ఆధ్వర్యంలో రూ. 7 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షుడు రవీంద్రనాథ్, కోశాధికారి రవికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

గుడివాడరూరల్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా వరిగడ్డి వామి దగ్ధమైన సంఘటన మండలంలోని లింగవరంలో ఆదివారం జరిగింది. లింగవరం గ్రామంలోని ఓ కిరాణా షాపు పక్కన ఉన్న వరిగడ్డి వాముకు పక్కనే ఉన్న విద్యుత్ సరఫరా చేసే స్తంభం వైర్లు తగిలి మంటలు అంటుకున్నాయి. వెంటనే స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన ఫైర్ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తోట్లవల్లూరు: వేసవి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తోట్లవల్లూరు ఎస్ఐ సీహెచ్ అవినాశ్ సూచించారు. వేసవిలో దొంగతనాలు ఎక్కువగా జరగటానికి ఆస్కారం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయమై మండల వ్యాప్తంగా మైకు ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంటికి సరైన కాపలా ఏర్పాటు చేసుకోకుండా ఎక్కడకూ వెళ్లవద్దని పేర్కొన్నారు. తీర్థయాత్రలకు, పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇంటిలో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు బ్యాంకు లాకర్‌లో భద్రపరచుకుని వెళ్లాలని సూచించారు.

విద్యార్థినికి వితరణ

గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థినికి రూ. 5 వేలు వితరణగా అందజేశారు. ఆదివారం స్థానిక పుల్లలపాడు రోడ్‌లోని సేవాసంస్థ కార్యాలయంలో సర్వసభ్యసమావేశం జరిగింది. తొలుత పహల్గాం మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఓదార్పు కలగాలని మౌనం పాటించారు. అనంతరం నేరెల్ల పూర్ణ చంద్రికకు రూ. 5వేలు విద్యాప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, గుడివాడ అధ్యక్షుడు ఎ. గోపిరెడ్డి, వైస్ ప్రసిడెంట్ డి. సీతారామస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించండి

కైకలూరు: కొల్లేరుకు చేరే నీటిని దిగువకు పంపడానికి ప్రధాన పాత్ర పోషించే ఉప్పుటేరు ఆక్రమణల తొలగింపునకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కోరారు. స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉప్పుటేరు వాస్తవ విస్తీర్ణం 237 మీటర్లకు కేవలం 60 మీటర్లు ఉందన్నారు. వ్యక్తిగతంగా కొందరు చేపల, రొయ్యల చెరువులను అక్రమ సాగు చేస్తున్నారన్నారు. త్వరలో ఆక్రమణలు తొలగించేలా చూస్తామన్నారు.

భూసార పరీక్షలతో భరోసా

అధిక రసాయన ఎరువుల వాడకంతో భూములు నిస్సారం



గుడివాడ మండలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది (ఫైల్)

గుడివాడరూరల్: రానున్న ఖరీఫ్ సాగును దృష్టిలో ఉంచుకుని అన్ని మండలాల్లో భూసార పరీక్షలను నిర్వహించడంలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ పరీక్షలు నిర్వహించి రైతులకు తగిన సలహాలు ఇచ్చి అధిక దిగుబడులకు భరోసా ఇవ్వనున్నారు. జిల్లాలో 21,791 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఒక్కో గ్రామానికి 50 నమూనాలు సేకరించాలని ఇప్పటికే జిల్లా వ్యవసాయశాఖ అధికారులు దిశానిర్దేశాలు చేశారు. పంట పొలాల్లో చెట్లనీడ, కాలిబాట, పంట కాలువలు, గట్లు వెంబడి కాకుండా మధ్యలో వీ ఆకారంలో 15 సెంటీ మీటర్ల లోతులో గుంత తవ్వి మట్టి నమూనాలను సేకరిస్తారు. ఆరున్నర ఎకరాలకు ఒక నమూనాను తీసుకుంటారు. సుమారు 8 నుంచి 10 ప్రాంతాల్లో సేకరించిన మట్టిని ఒక గోనె సంచిపై వేసి కలుపుతారు. దాన్ని నాలుగు భాగాలుగా విభజించి ఎదురెదురుగా ఉన్న భాగాలను కలిపి వాటిలో ఒక భాగాన్ని తీసుకుని అందులో అరకిలో చొప్పున మట్టిని సేకరించి భూసార కేంద్రానికి పంపుతారు. అనంతరం ఫలితాల కార్డులను రైతులకు అందజేస్తారు. జీపీఎస్ ఆధారంగా సేకరించిన చిత్రాలను ఎస్‌హెచ్‌సీ యాప్‌లో అప్‌లోడ్ చేసి ఫలితాల స్వభావాన్ని రైతుల సెల్‌ఫోన్లకు తెలుగులో నేరుగా పంపేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఉద్యాన పంటలకు మట్టి నమూనాల సేకరణ, చౌడు నేలల యాజమాన్య పద్ధతులు, క్షారగుణం మారితే ప్రత్యామ్నాయాలపై క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తారు.


మే నెలాఖరులోగా ఫలితాలు

జూన్ నుంచి ఖరీఫ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ లోపే మట్టి నమూనాలు సేకరించి ఫలితాలు అందించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. భూమిలోని ప్రధాన పోషకాలు అయిన నత్రజని, భాస్వరం, పొటాష్ పరిమాణాల్లో మార్పులను పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. ఫలితాలు వచ్చిన తర్వాత భూమిలో ఏ సూక్ష్మధాతువుల లోపం ఉందో తెలుసుకుని రైతులు ఎరువులను వినియోగించాలని, లేకుంటే నేల సారం కోల్పోయి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

భూమి ఆరోగ్యంతోనే అధిక దిగుబడులు సాధ్యం

పంటలకు విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడకంతో రైతులకు పెట్టుబడులు పెరగడమే కాకుండా భూసారం తగ్గిపోతోంది. దీనివల్ల పంటలు సక్రమంగా పండక దిగుబడులు తగ్గుతున్నాయి. నేల స్వభావం తెలుసుకోకుండా ఎరువులు వాడినా ఆశించిన ప్రయోజనం ఉండదు. భూమి ఆరోగ్యంగా తగిన పోషకాలతో ఉన్నప్పుడే మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలో తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. వాటి నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటే రైతులకు వ్యయభారం తగ్గుతుంది.

నమూనాల సేకరణ ప్రారంభించాం



మట్టి నమూనాల సేకరణను ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ప్రారంభించాం. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాం. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఏయే పంటలు వేసుకోవచ్చు, ఎంత మోతాదులో ఎరువులు వినియోగించాలని, ఎంత దిగుబడులు వస్తాయో తెలుస్తాయి. వీటిని రైతులకు వివరించడం వల్ల ఎరువుల పెట్టుబడి తగ్గుతుంది.

– మనోహర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ముగిసిన గంగానమ్మ జాతర



ఆలయంలోని గంగానమ్మ



ఊరేగుతున్న గంగానమ్మ తల్లి పోతురాజు గడలు

ఉండ్రపూడి(పామర్రు): రెండు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్న గంగానమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. తొలుత ఆలయంలోని అమ్మవారిని 108 జల బిందెలతో జలాభిషేకం చేశారు. అమ్మవారిని పసుపు కుంకుమలతో అలంకరించి నూతన వస్త్రాలను ధరింప చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పొలిమేరలో ఉన్న కట్టుని తొలగించారు. అక్కడి నుంచి అమ్మవారిని పోతురాజు గడలను గ్రామంలో మేళ తాళాలతో కనకతప్పెట్లతో వైభవంగా ఊరేగించారు. గ్రామస్తులు అమ్మవారికి ఇంటింటి వద్ద నీటిని వారగా పోసి నీరాజన హారతులు ఇచ్చి చద్ది నివేదనలను సమర్పించారు. ఊరేగింపు తదుపరి అమ్మవారిని ఆలయంలో ప్రవేశ పెట్టారు. గ్రామస్తులు అమ్మవారికి నివేదనలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ తోట పోలాక్షి రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు మేకా గోవర్ధనరావు, తోట రాంబాబు, దాసు ఏడుకొండలు, మట్టా శ్రీనివాసరావు, తోట రామాంజనేయులు, మట్టా నాగమల్లేశ్వరరావు, చీర్ల ఆంజనేయులు, మండపాక దినేష్, తంగెళ్ల రవితేజ పాల్గొన్నారు.

పోప్ మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ప్రదర్శన



కురుమద్దాలిలో కొవ్వొత్తుల ప్రదర్శన

కురుమద్దాలి(పామర్రు): మండలంలోని కురుమద్దాలి గ్రామంలోని ఆర్సీఎం చర్చి నిర్వాహకులు పోప్ ఫ్రాన్సిస్ మృతికి సంతాపంగా ఆదివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దయగలవాడు, ప్రగతి శీలుడు అయిన పోప్ ఫ్రాన్సిస్ ఈ నెల 21న తెల్లవారుజామున వాటికన్ సిటీలో మరణించారని ప్రకటించారని తెలిపారు. ఈ విషాద వార్త ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులను మాత్రమే కాకుండా అన్ని వర్గాల వారిని బాధ పెట్టిందన్నారు. ఇతరులు బాధలను తన బాధలుగా భావించి, కరుణతో వ్యవహరించే వ్యక్తి పోప్ అని విశ్వాసులు కొనియాడారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



డీఎస్పీ ధీరజ్‌కు అమ్మవారి చిత్ర పటాన్ని అందించిన ఈఓ కొండలరావు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తగు ఏర్పాట్లు చేశారు. వేసవిని పురస్కరించుకుని ఆయన చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ చేపట్టారు.

కొండలమ్మను దర్శించుకున్న డీఎస్పీ

శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుడివాడ డీఎస్పీ ధీరజ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత ఆయన పేరిట అమ్మవారికి వేద పండితుడు రుద్రపాక శరశ్చంద్ర సంతోష్ ప్రత్యేక పూజలను చేశారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణంలో పీటలపై కూర్చొన్న దంపతులు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులకు శిక్ష

పామర్రు: మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు శిక్షార్హులని పామర్రు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక పోలిస్‌స్టేషన్‌లో చిన్నారులకు వారి తల్లిదండ్రులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు డ్రైవ్ చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ డ్రైవ్‌లో ముగ్గురు చిన్నారులను అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారికి కూడా కౌన్సెలింగ్‌ను ఇచ్చారు.

డ్రోన్ సాయంతో మందు బాబుల గుర్తింపు

మండలంలోని జుఝువరం గ్రామంలో ఓ చెట్టుకింద మందు తాగుతున్న ఇద్దరిని డ్రోన్ గుర్తించింది. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మైనర్లను డ్రైవింగ్‌కు దూరంగా పెట్టాలని ఏఎస్ఐ వి.బాల వెంకటేశ్వరరావు అన్నారు. గుడ్లవల్లేరులో డ్రైవింగ్ చేస్తున్న మైనర్లను ఆదివారం అదుపు చేసే కార్యక్రమాన్ని ఆయనతో పాటు పోలీసు సిబ్బంది చేపట్టారు. మైనర్ల చేతికి వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణం కాకుండా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని ఏఎస్ఐ సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కైకలూరు: కోదండ రామాలయ ప్రహరీ నిర్మాణానికి కోరుకొల్లుకు చెందిన వర్రే వెంకట సత్యనారాయణ, నీరజా దంపతులు(యూఎస్ఏ) పంపిన రూ.2,02,440 చెక్కును వారి బంధువులు కోరుకొల్లు శివారు గొల్లగూడెంలో నిర్వాహకులకు ఆదివారం అందించారు. వర్రే జగన్నాథం చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి చెన్నంశెట్టి కృష్ణ, ట్రస్టీ చైర్మన్ లక్ష్మణరావు, సరళ, బాబు పాల్గొన్నారు.

సాహితీ సంబరాలకు ఆహ్వానం

కైకలూరు: ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సహజ కవి దండే బెనర్జీకి ఆదివారం ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు పేరుతో మే 10, 11 తేదీలలో ఏలూరు మహాలక్ష్మీ గోపాలస్వామి కల్యాణ మండపంలో సాహితీ కార్యక్రమం రెండు రోజులు జరగనుంది.

అ'పూర్వ' కలయిక



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

గుడ్లవల్లేరు: స్థానిక ఎస్‌సీఆర్ఎం హైస్కూల్‌కు చెందిన 2005–2006 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని పశువుల సంత ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు సుధాకర్, అరుణ, సుబ్రహ్మణ్యంను సన్మానించి వారికి జ్ఞాపకలను అందజేశారు. చాలా ఏళ్ల తరువాత ఇలాంటి కలయిక చాలా ఆనందకరంగా ఉందని ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తెలిపారు. అనంతరం విద్యాభ్యాసం చేసే రోజుల్లో వారి అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ ఆనంద తీరంలో మునిగితేలారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆత్మీయ సమ్మేళనం

మొవ్వ: స్థానిక శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. 2001–02 సంవత్సరంలో చదివిన విద్యార్థులు, వారిని క్రమశిక్షణతో తీర్చిదిద్దిన అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఎస్ శ్రీదేవి, గౌరిపర్తి శ్రీ వెంకటశేషగిరి (ఉయ్యూరు ఎంపీడీఓ), పూర్వ ప్రధానోపాధ్యాయులు సుబ్బరాజు, మోహన్ దాస్, కేఆర్‌కే శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రజావేదిక వాయిదా

గుడివాడ టౌన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ డీకే బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం వాయిదా పడినట్లు ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో కలెక్టర్ హాజరు కావాల్సి ఉన్నందున ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సాధారణ అర్జీలు యథావిధిగా ఆర్డీఓ ఆధ్వర్యంలో స్వీకరిస్తారని తెలిపారు.

అర్హులైన వారు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడరూరల్: మండలంలోని గ్రామాల్లోని ఇళ్ల స్థలాలకు అర్హులైన ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, పట్టణంలో అర్హులైన ఉన్న వారికి రెండు సెంట్లు, గ్రామాల్లో అర్హులై ఉన్న వారికి మూడు సెంట్లు మంజూరు చేసేందుకు జీఓను జారీ చేసిందని పేర్కొన్నారు. మండలంలో అర్హులైన వారు తమ సచివాలయాల్లో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా బాబా మందిరం వార్షికోత్సం

మండవల్లి: మండలంలోని భైరవపట్నం బాబా మందిరం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నీటి సంఘం మాజీ అధ్యక్షుడు చదలవాడ శేషగిరిరావు దంపతులు పూజలు జరిపారు. కార్యక్రమంలో చాపరాల దుర్గాప్రసాద్, గాదిరాజు భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రోడ్డు విస్తరణ పనులు

మండవల్లి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. విజయవాడ–భీమవరం జాతీయ రహదారిపై జరుగుతున్న ఈ పనులు పూర్తవడానికి రెండేళ్లు పడుతుందని సూపర్‌వైజర్ నాగరాజు పేర్కొన్నారు.

కొల్లేటికోట పెద్దింట్లమ్మకు మొక్కులు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఆదివారం భక్తులు విచ్చేశారు. దేవాలయ అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ చంటిబాబు

గుడివాడరూరల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం ఎస్ఐ చంటిబాబు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు నేరాలను వదిలి స్వేచ్ఛగా జీవించాలన్నారు. చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులు ప్రవర్తన మార్చుకోకపోతే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

గుడివాడ టౌన్: ప్రజల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం స్థానిక 7వ వార్డులో ఆయన పర్యటించారు. కొత్తపేట పరిసర ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడారు. స్థానికుల నుంచి రోడ్లు, డ్రెయిన్‌ల సమస్య ఎక్కువగా ఉందని ఫిర్యాదులు రాగా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని తెలిపారు. చిన్న సమస్యలు తక్షణమే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

సింగలూరు అభివృద్ధికి శ్యామ్‌కుమార్ కృషి అభినందనీయం



మొక్కలు నాటుతున్న సైక్లింగ్ క్లబ్ వారు

గుడ్లవల్లేరు: మండలంలోని సింగలూరును ప్రముఖ సేవకుడు డాక్టర్ బందారు శ్యామ్‌కుమార్ దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం అభినందనీయమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గుడివాడ పట్టణానికి ప్రముఖ యువ వైద్యులు, వివిధ రంగాల యువతతో కూడిన గుడివాడ సైక్లింగ్ క్లబ్ బృందం సైకిళ్లపై వచ్చారు. గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సింగలూరులో మౌలిక సదుపాయాలు కల్పించటం, గ్రామస్తులు దురలవాట్లకు దూరంగా ఉండటం, ఆధ్యాత్మికతో కూడిన సమగ్ర అభివృద్ధిలో శ్యామ్‌కుమార్ రెండు దశాబ్దాల కృషి అభినందనీయమన్నారు. డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ మాట్లాడుతూ సింగలూరు గ్రామం ప్రగతి పథంలో రూపాంతరం చెందటంలో శ్యామ్‌కుమార్, సరస్వతి దంపతుల కృషితో పాటు గ్రామస్తుల సహకారం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉండవల్లి సురేష్ బాబు, డాక్టర్ అనురాధ, డాక్టర్ పిన్నమనేని రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి

పామర్రు: మండలంలో సామాజిక భద్రత పింఛన్ అందుకుంటున్న వ్యక్తి చనిపోతే ఆ పింఛన్‌ను అతడి భార్యకు బదలాయిస్తామని పామర్రు ఎంపీడీఓ కె జ్యోతి ఆదివారం తెలిపారు. అర్హులైన వారు వారి పరిధిలోని గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ నుంచి 2024 అక్టోబరు మధ్య కాలంలో పింఛన్ పొందుతూ చనిపోయిన వారి పింఛన్‌ను వారి భార్యలకు ఇస్తామని ఎంపీడీఓ తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తోట్లవల్లూరు: వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తోట్లవల్లూరు బ్రాంచి గ్రంథాలయాధికారి డి. బాబూరావు తెలిపారు. స్థానిక బ్రాంచి గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు వేసవి శిక్షణ శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయానికి విచ్చేసి వేసవి శిబిరాన్ని జయప్రదం చేయాలని బాబూరావు కోరారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకురాలు పి. శాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. పిల్లలకు నీతి కథలు చెప్పటం, పుస్తకాలు చదివించడం, చిత్రలేఖనం వంటివి నేర్పించనున్నట్లు తెలిపారు. పట్టణ చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

మొవ్వలో..

మొవ్వ: మొవ్వలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులను రోజు ఉదయం 8 నుంచి 11గంటల వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి తూములూరి కృష్ణకుమారి తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.